క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 22న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. పోలీసు హెడ్ క్వార్టర్స్ ప్రాంతంలో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించండి

మామునూరు: బడీడు పిల్లలను బడిలో చేర్చాలని స్థానిక కార్పొరేటర్ అరుణ కోరారు. ఈమేరకు వరంగల్ 43వ డివిజన్ మామునూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (హరిజన వాడ)లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కరుణశ్రీ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన విద్యను అందుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎర్ర విజయ్‌కుమార్, కాంగ్రెస్ నాయకుడు సింగారపు కుమారస్వామి, ఉపాధ్యాయులు మమత, కిరణ్, అటెండర్ పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అబాకస్‌లో ప్రతిభ



వరంగల్: రాష్ట్రస్థాయి అబాకస్‌లో వరంగల్ కాశిబుగ్గలోని స్టాండర్డ్ హైస్కూల్ విద్యార్థి పి.విజయవర్ధన్ రెండో స్థానంలో నిలిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణాకర్‌రాజు తెలిపారు. ఈమేరకు ఆ విద్యార్థిని సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ రమాదేవి, అబాకస్ టీచర్ సుష్మ, పాఠశాల ఇన్‌చార్జ్ జయశ్రీ, భారతి, మహిత పాల్గొన్నారు.

మధ్యవర్తులుగా ఎంపిక

హసన్‌పర్తి: తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీ మీడియేటర్ వలంటీర్లుగా హసన్‌పర్తికి చెందిన దీకొండ భిక్షపతి, భీమారానికి చెందిన గాజుల గోవర్ధన్ ఎంపికయ్యారు. నగరంలో మూడు రోజులపాటు శిక్షణ తరగతులు కొనసాగాయి. ఈమేరకు వారికి లీగల్ సర్వీసెస్ అథారిటీ వారు సర్టిఫికెట్లు అందజేశారు.

సీపీని కలిసిన బీజేపీ నేతలు



హన్మకొండ: వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్‌ను బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ కలిశారు. పోలీసు కమిషనరేట్‌లో సీపీని సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం జిల్లాలోని శాంతి భద్రతలపై చర్చించారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, నాయకులు సంపత్, అరణ్య, రుత్విక్ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ పరపతి సంఘం ఎన్నిక



హన్మకొండ కల్చరల్: హనుమకొండలోని ఆదర్శ విశ్వబ్రాహ్మణ సంక్షేమ ట్రస్ట్ భవనంలో విశ్వబ్రాహ్మణ పరపతి సంఘం ఎనిమిదో విస్తృత స్థాయి సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ పరస్పర సహాయక సహకార పొదుపు, పరపతి సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సిద్ధోజు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శిగా శ్రీపాద సుధాకర్‌రావు, కోశాధికారిగా డాక్టర్ పాడిశెట్టి విష్ణువర్ధన్, ఉపాధ్యక్షుడిగా ఆకోజు సురేందర్‌రావు, సంయుక్త కార్యదర్శిగా తాడూరి ప్రవీణ్, కార్యవర్గ సభ్యులుగా మట్టివాడ బ్రహ్మాచారి, రాగి కరుణాకర్, సిద్ధోజు సూర్యప్రకాష్, శ్రీరామోజు గిరిబాబు ఎన్నికయ్యారు.

ఓయూలో అరెస్టులను నిరసిస్తూ రాస్తారోకో



కేయూ క్యాంపస్: ఉస్మానియా యూనివర్సిటీలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు సమ్మె చేస్తుండగా అక్కడి పోలీసులతో ఆ యూనివర్సిటీ వీసీ అక్రమంగా అరెస్టు చేయించారని కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు నిరసన తెలిపారు. ఈమేరకు కేయూ రెండో గేట్ ఎదురుగా రోడ్డుపై సోమవారం మానవహారం నిర్వహించారు. న్యాయమైన డిమాండ్ల సాధనకు సమ్మె చేస్తున్న వారిని అరెస్ట్ చేయడం శోచనీయమని వాపోయారు.

రూ.2 కోట్ల వ్యయంతో రోడ్డు అభివృద్ధి

- హసన్‌పర్తి తహసీల్దార్ కార్యాలయం నుంచి ఎల్లాపురం వరకు విస్తరణ



హనుమకొండ - కరీంనగర్ జాతీయ రహదారి

హసన్‌పర్తి: హసన్‌పర్తి తహసీల్దార్ కార్యాలయం నుంచి ఎల్లాపురం వరకు రోడ్డు విస్తరణకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు తెలిపారు. ఈమేరకు రెండు కోట్ల రూపాయలు మంజూరైనట్లు వివరించారు. డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌కు రూ.25 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు ఎమ్మెల్యే చెప్పారు. హనుమకొండ - కరీంనగర్ ప్రధాన రహదారిలోని హసన్‌పర్తి తహసీల్దార్ కార్యాలయం నుంచి ఎల్లాపురం వరకు హసన్‌పర్తి నల్లగట్టు గుట్ట, పాత సినిమా టాకీస్, కట్టకోత మిషన్, పెద్ద చెరువు కట్ట సమీపంతో పాటు సీతంపేట క్రాస్‌రోడ్డు ప్రాంతాల్లో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మార్గంలో సెంట్రల్ లైటింగ్ సిస్టంతో పాటు డివైడర్లు లేకపోవడమే ప్రమాదాలకు కారణమని తెలుస్తోంది. ఈక్రమంలో రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే వివరించారు. డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

పాలనలో సివిల్ సర్వెంట్ల పాత్ర కీలకం

- కేడీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి



సభలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజారెడ్డి

విద్యారణ్యపురి: పాలన ద్వారా ప్రజలకు సేవలందించడంలో జాతీయ సివిల్ సర్వీస్ అధికారుల పాత్ర ఎంతో కీలకమని హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి అన్నారు. కేడీసీలో ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ సివిల్ సర్వీసుల దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ సివిల్ సర్వీస్ అధికారులు నిష్పక్షపాతంగా, నిజాయితీగా, నిబద్ధతతో, తటస్థ సుగుణాలతో బాధ్యతలు నిర్వర్తిస్తే దేశ పాలన స్థిరంగా ఉంటుందన్నారు. పాలనాపరంగా ప్రభుత్వాల పథకాలు, విధానాలను ప్రజలకు చేరవేయడం, శాంతిభద్రతల నిర్వహణలో వారి పాత్ర చాలా ముఖ్యమని వివరించారు. సమావేశంలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం అధిపతి డాక్టర్ ప్రదీప్ శ్రవణ్, అధ్యాపకులు దేముడు నాయుడు, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఆడెపు వెంకటరమణ, డాక్టర్ రవీందర్, ఇందిరాదేవి, కిషోర్‌కుమార్, భరత్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సీతారాములు, శ్రీదేవి, రాంరెడ్డి, సమ్మయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

సామాజికాభివృద్ధిలో పరిశోధనలే ముఖ్యం





మాట్లాడుతున్న కిష్టయ్య, శ్రీనివాస్‌రెడ్డి

కేయూ క్యాంపస్: సామాజికాభివృద్ధిలో సామాజిక పరిశోధనలే కీలకమని కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హెచ్ఆర్ఎం విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ ఎం.కిష్టయ్య అన్నారు. ఆ విభాగంలో పరిశోధకులకు వారం రోజులపాటు రీసెర్చ్ మెథడాలజీపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా కిష్టయ్య సోమవారం పాల్గొని మాట్లాడారు. సామాజిక సమస్యలపై పూర్తిస్థాయిలో పరిశోధనలు చేసి వాటి పరిష్కార మార్గాలను అన్వేషించాలన్నారు. రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పరిశోధనలో వాస్తవికత ప్రతిబింబించాలని పేర్కొన్నారు. సమావేశంలో విభాగం అధిపతి ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాసరావు, బీఓఎస్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాసులు, అధ్యాపకులు చీకటి శ్రీనివాస్, బుర్రి ఉమాశంకర్, మోహన్, బండి శ్రీనివాస్, స్కాలర్స్ పాల్గొన్నారు.

కేఎంసీలో సైకిల్ క్లబ్ ప్రారంభం



సైకిల్ క్లబ్‌ను ప్రారంభిస్తున్న రాంకుమార్ రెడ్డి

ఎంజీఎం: కాకతీయ మెడికల్ కళాశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సైకిల్ క్లబ్, స్టూడెంట్ బాడీ రూమ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాంకుమార్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి సైకిల్ క్లబ్‌తో పాటు విద్యార్థులు సమావేశాలు నిర్వహించుకునేందుకు ప్రత్యేకంగా స్టూడెంట్ బాడీ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇవి కళాశాల అభివృద్ధిలో విద్యార్థుల పాత్రను పెంచేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈమేరకు బాలుర వసతి గృహానికి 30 సైకిళ్లను ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినికి చేయూతనివ్వండి



ఆర్థిక సాయం అందజేస్తున్న అశోక్, రవి

హన్మకొండ కల్చరల్: ఎంబీబీఎస్ చదువుతున్న పేద విద్యార్థినికి దాతలు చేయూతనివ్వాలని సామాజిక వేత్తలు మేరుగు అశోక్, గడ్డం రవి కోరారు. వరంగల్ 39వ డివిజన్ ఏకశిలనగర్ (ప్రస్తుతం భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్)కు చెందిన ఆటో డ్రైవర్ అడప వీరస్వామి, విజయ దంపతుల కుమార్తె అడప రిషిక.. భూపాలపల్లి జిల్లా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువుతోంది. ఈమేరకు శివనగర్‌లోని స్వగృహంలో రిషికకు రూ.15వేలు ఆర్థిక సాయాన్ని మేరుగు అశోక్, గడ్డం రవి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో వెన్నపురెడ్డి రమణారెడ్డి, మెరుగు సుహాసిని, పిన్నిరెడ్డి, ప్రణీత్‌రెడ్డి, సన్నిహిత్, భవిష్య, బి.సాగర్ పాల్గొన్నారు.

తెలంగాణ మేలుకోరే పార్టీ బీఆర్ఎస్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ గౌడ్

నయీంనగర్: తెలంగాణ ప్రజల మేలుకోరే పార్టీ, భవిష్యత్‌లో ప్రజల హక్కుల కోసం కొట్లాడేది బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. 53వ డివిజన్‌లో పార్టీ రజతోత్సవ సన్నాహక సమావేశాన్ని కేయూ జంక్షన్ వద్ద సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దివంగత ప్రొఫెసర్ బియ్యాల జనార్దన్ రావు మేనల్లుడు తక్కళ్లపల్లి వినీల్ రావుతో పాటు సుమారు వంద మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్, వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్షా అరవై వేల ఉద్యోగాలు ఇచ్చి, మరిన్ని ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వగా, వాటిని కాంగ్రెస్ పార్టీ తన ఖాతాలో వేసుకుందన్నారు. తెలంగాణలో విద్యా విప్లవం తీసుకొచ్చి, వెయ్యికి పైగా గురుకులాలు, కేజీ టు పీజీ విద్యను అందించింది కేసీఆర్ అని గుర్తుచేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సోదా కిరణ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేత్రాలను నిర్లక్ష్యం చేయొద్దు



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఖిలా వరంగల్: నేత్రాలను నిర్లక్ష్యం చేయొద్దని, జాగ్రత్తగా చూసుకోవాలని మెగా ఫ్యామిలీ అభిమాన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కరాటే ప్రభాకర్ సూచించారు. వరంగల్ శివనగర్ భూపేష్ నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో శంకర్ కంటి ఆస్పత్రి హైదరాబాద్ ఆధ్వర్యంలో మెగా ఫ్యామిలీ అభిమాన సంఘాలు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ప్రగతి సేవా సమితి, సత్యం వయ సంయుక్త సౌజన్యంతో ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికంగా మొబైల్ వాడకం వల్ల ప్రతీఒక్కరిలో కంటి సమస్యలు వస్తున్నాయని అన్నారు. సుమారు 200 మందికి నేత్ర వైద్యుడు సందీప్‌రాజ్ పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రగతి సేవా సమితి ఫౌండర్ జాన్, కన్వీనర్ టీవీ అశోక్, మెగా ఫ్యామిలీ అభిమాన సంఘాల ప్రతినిధులు చిరంజీవి, కొయ్యడ ఉమ, రమ, అరుణ, అజీర, అంజమ్మ పాల్గొన్నారు.

చెత్త సేకరణపై దృష్టి సారించాలి



వరంగల్: నగరంలో వ్యాపార, వాణిజ్య సముదాయాల చెత్త సేకరణపై దృష్టి సారించడంతో పాటు వ్యాపారులకు అవగాహన కల్పించాలని అధికారులను మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. వరంగల్ పాత బీట్‌బజార్ ప్రాంతంలో మేయర్ సోమవారం తనిఖీలు నిర్వహించి శానిటేషన్ స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శానిటేషన్ పనులు సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జ్ సీపీ రవీందర్ రాడేకర్, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, టీపీఎస్ అనిల్, శానిటరీ జవాన్లు పాల్గొన్నారు.

నేడు వక్ఫ్ చట్టంపై సదస్సు



నయీంనగర్: గోపాల్‌రావు ఠాకూర్ స్మారక సమితి ప్రజ్ఞాభారతి వరంగల్ ఆధ్వర్యంలో వక్ఫ్ చట్టం అంటే ఏమిటి, ఎందుకు అనే అంశాలపై అవగాహన మంగళవారం సదస్సు నిర్వహించనున్నట్లు ప్రజ్ఞా భారతి కన్వీనర్ డాక్టర్ సమ్మిరెడ్డి, కో కన్వీనర్ బూర రాంచందర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ప్రభాకర్ రావు తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమ్మిరెడ్డి మాట్లాడుతూ విజయ టాకీస్ సమీపంలోని ఎస్ఎస్‌వీ ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్న సదస్సులో ముఖ్యవక్తలుగా సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, పాత్రికేయుడు రాకా సుధాకర్ పాల్గొంటారని తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ మేయర్ టి.రాజేశ్వర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు ఎం.ధర్మారావు, వన్నాల శ్రీరాములు, మాజీ ఎంపీ సీతారాం నాయక్, టి.కిషన్‌రావు, విష్ణువర్ధన్ రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు గాలికొదిలేసిన కేంద్రం

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు



ధర్నా చేస్తున్న నాయకులు

హన్మకొండ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. ఈమేరకు హనుమకొండ కాళోజీ కూడలిలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకూ నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, వాటిని నియంత్రించడంలో నరేంద్రమోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. నిత్యావసరాల ధరల పెంపును అరికట్టకుండా బ్లాక్ మార్కెటింగ్ దారులకు పాలకులు వంత పాడుతున్నారని అన్నారు. హిందువులు, ముస్లింల పేరుతో ప్రజలను విడగొట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. ప్రజా వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక విధానాలను కేంద్రం మానుకోవాలని సూచించారు. పార్టీ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, నద్దునూరి అశోక్ స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

- సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి

వరంగల్: పెంచిన నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ హెడ్ పోస్టాఫీస్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ, పేదల పట్ల ద్వంద్వ నీతిని అవలంబిస్తూ నిత్యావసర వస్తువుల ధరలను పెంచుతూ ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థను ప్రక్షాళన చేసి పేద కుటుంబాలకు 14 రకాల నిత్యావసర వస్తువులను రేషన్ కార్డుల ద్వారా అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ సహాయ కార్యదర్శులు బాషుమియా, పనాస ప్రసాద్, నాయకులు లక్ష్మణ్, బద్రి, రాజు, ల్యాదల్ల శరత్, జాన్‌పాల్, అక్బర్‌పాషా, దస్రునాయక్, జన్ను రాజు, రాజేందర్, శ్రీను పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న నాయకులు, స్థానికులు

వరంగల్: ప్రజల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం వరంగల్ జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు పార్టీ ఆధ్వర్యంలో కార్పొరేషన్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 1నుంచి 20వ తేదీ వరకు నగరంలో స్థానిక సమస్యలపై సర్వేలు నిర్వహించామని, ఈ సందర్భంగా అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయని వివరించారు. ముఖ్యంగా నగర వ్యాప్తంగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. శివనగర్‌లో అండర్ డ్రెయినేజీ నిర్మాణం మూడేళ్లుగా నత్తనడకన సాగుతోందన్నారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సింగారపు బాబు, నలిగంటి రత్నమాల, ఎండీ.బషీర్, అరూరి కుమార్, వలదాసు దుర్గయ్య, నాయకులు, గుడిసెవాసులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

- వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వర్‌రావు



ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వరంగల్: జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమాన్ని ప్రతీ ఇంటికి కరపత్రం రూపంలో తీసుకెళ్లి, భారత రాజ్యాంగాన్ని ప్రతీ వ్యక్తి కాపాడుకోవాలని వరంగల్ తూర్పు కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు, వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. రైల్వేస్టేషన్ సమీపంలోని ఎంకే నాయుడు హోటల్‌లో తూర్పు నియోజకవర్గం కార్యకర్తల సమావేశం సోమవారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ కుట్రల నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని సూచించారు. సమావేశంలో ఏఐసీసీ కోఆర్డినేటర్ పులి అనిల్‌కుమార్, నాయకులు గోపాల నవీన్‌రాజ్, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఫొటోగ్రఫీ ఓ కళ

హసన్‌పర్తి: ఫొటోగ్రఫీ ఓ కళ అని ఓరుగల్లు వైల్డ్ లైఫ్ వ్యవస్థాపకుడు నాగేశ్వర్‌రావు అన్నారు. కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫొటో గ్రఫీ అండ్ మీడియా క్లబ్, స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ ఆధ్వర్యంలో 'ఫొటోగ్రఫీ టెక్నాలజీలో నైపుణ్యం'పై సోమవారం చర్చాగోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక ఒక ఫొటో వేయి పదాలకు సమానమని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి, ప్రొఫెసర్ వేణుమాధవ్, ప్రొఫెసర్ శ్రీలత, డాక్టర్ నర్సింహారావు, డాక్టర్ ప్రభాకరాచారి, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు

కాజీపేట రూరల్: బీఆర్ఎస్ రజతోత్సవం, ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని కాజీపేట బాపూజీనగర్ మెయిన్ రోడ్డులో పార్టీ నాయకుడు గబ్బెట శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం సంబురాలు జరుపుకున్నారు. ఈనెల 27వ తేదీన ఎలకతుర్తిలో జరగనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ ఇంటింటికి వెళ్లి బొట్టు పెట్టి కరపత్రాలు పంచినట్లు కార్పొరేటర్ సంకు నర్సింగరావు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

హన్మకొండ: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు వరంగల్ 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత తెలిపారు. విద్యానగర్‌లో ఆమె సోమవారం పర్యటించారు. కాలనీలో తిరుగుతూ స్థానికులను పలుకరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

అంజన్న ఆలయంలో 50మందికి మాలధారణ

కాజీపేట: కాజీపేట అభయాంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ మాలధారణ కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన పూజారి జాగర్లపూడి శ్రీనివాస్‌శర్మ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన 50మంది భక్తులకు మాలధారణ చేశారు.

కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలి

మడికొండ: రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని పీఏసీఎస్ దర్గా సొసైటీ చైర్మన్ ఉకంటి వనంరెడ్డి సూచించారు. కాజీపేట మండలం మడికొండలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. దళారులకు ధాన్యాన్ని విక్రయించి మోసపోవద్దని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి గిట్టుబాటు ధర పొందాలన్నారు.

ప్రాంతేతరుల పేర్లు పెట్టొద్దు

నయీంనగర్: తెలంగాణ సంస్థలకు ప్రాంతేతరుల పేర్లు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని విరమించుకోవాలని తెలంగాణ వికాస సమితి తీర్మానించింది. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రగతి గతం - వర్తమానం - భవిష్యత్ అనే అంశంపై సోమవారం జరిగిన సదస్సులో వక్తలు ప్రొఫెసర్ సీతారాం రావు, వేణుగోపాల్ స్వామి, ఏ.శ్రీనివాస్, టీవీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భిక్షపతి నాయక్ మాట్లాడుతూ తాము ఏ ప్రాంతానికి, ఏ సామాజిక వర్గానికి వ్యతిరేకం కాదని అన్నారు. ప్రతిఒక్కరూ తెలంగాణ అస్తిత్వ పోరాటాన్ని, ఆకాంక్షలను గౌరవించాలని వారు కోరారు.

స్టార్ టీచర్స్ అసోసియేషన్ కార్యవర్గం

హసన్‌పర్తి: స్టార్ టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 56వ డివిజన్ గోపాలపురంలోని కేజీ.రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడిగా పూర్ణాచారి, ప్రధాన కార్యదర్శిగా బిల్లా రఘునాథ్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా శరవణ్, కోశాధికారిగా బానోతు కృష్ణ, ఆడిటర్లుగా అనిల్‌కుమార్, ఏకాంబ్రం, సలహాదారుడిగా కామిడి సతీష్‌రెడ్డి, కార్యదర్శిగా బాపు ఎన్నికయ్యారు.

దేవన్నపేటలో రాజకీయ రగడ

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం దేవన్నపేటలో అధికార, ప్రతిపక్షాల మధ్య రగడ నెలకొంది. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురికి గాయాలయ్యాయి. ఈమేరకు రెండు వర్గాల వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దేవన్నపేటలో అధికార, ప్రతిపక్షాల మధ్య కొంతకాలంగా అంతర్గతంగా జరుగుతున్న గొడవ సోమవారం బహిర్గతమైంది.

మల్లన్న వైన్స్‌లో మద్యం చోరీ

మామునూరు: వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారిపై నాయుడు పెట్రోల్ బంక్ సమీపంలోని మల్లన్న వైన్స్‌లో గుర్తు తెలియని వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. పోలీసులు కథనం ప్రకారం.. సోమవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తి వైన్స్ షెట్టర్ తాళాలు ధ్వంసం చేసి రూ.50వేల విలువైన మద్యం అపహరించాడు. సీసీటీవీ ఫుటేజీ పరిశీలించి నిందితుడి ముఖచిత్రాలను పోలీసులు వెల్లడించారు. వైన్‌షాపు నిర్వాహకుడు చొక్కారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ వివరించారు.

సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలి

హసన్‌పర్తి: హసన్‌పర్తి తహసీల్దార్ కార్యాలయం నుంచి ఎల్లాపురం వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు. ఈమేరకు కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడేను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ మార్గంలో డివైడర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ లేకపోవడంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కమిటీ ప్రధాన కార్యదర్శి జన్ను కిషన్, ఉపాధ్యక్షుడు పెద్దమ్మ శ్రీనివాస్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

హన్మకొండ: 57వ డివిజన్‌లోని సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి కోరారు. ఈమేరకు బల్దియా కార్యాలయంలో కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడేను సోమవారం కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా స్వరూపరాణి మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు.

డంపింగ్ యార్డు తొలగించాలని వినతి

మడికొండ: గ్రేటర్ వరంగల్ పరిధిలోని మడికొండ - రాంపూర్ గ్రామాల మధ్య ఉన్న డంపింగ్ యార్డును తొలగించాలని మడికొండ గ్రామస్తులు కోరారు. ఈమేరకు 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికరెడ్డి ఆధ్వర్యంలో నగర మేయర్ గుండు సుధారాణికి సోమవారం వినతిపత్రం అందజేశారు. జానపట్ల సారయ్య, తండ శంకర్, బుర్ర రాజ్‌కుమార్, బోగి దేవేందర్, శ్రీనివాస్, గడ్డం మహేందర్, వెన్నమల్ల రమేష్, పల్లపు రాజ్‌కుమార్, రాకేష్, కిరణ్, శివ, నరోత్తమ్‌రెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

సీఎం గారు మా మొర ఆలకించండి

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లోని పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని కాకతీయ యూనివర్సిటీలో పార్ట్‌టైం అధ్యాపకులు కోరారు. ఈమేరకు 'సీఎం గారు మా మొర ఆలకించండి' అంటూ కేయూ పరిపాలన భవనం వద్ద సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి సోమవారం విజ్ఞప్తిచేశారు. కేయూ పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ రాంబాబు, బాధ్యులు నరేంద్రనాయక్, దేవోజీ నాయక్, తిరుణహరి శేషు, సంజీవ్, భాగ్యమ్మ, వినోద, శ్రీధర్, దాసు, రాజ్‌కుమార్, సురేష్, రాజన్న, భిక్షపతి, హరికుమార్, ప్రగతి, మౌనిక, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలి

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని కాకతీయ యూనివర్సిటీ టెక్నికల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈమేరకు కేయూలోని పరిపాలన భవనం వద్ద చేపట్టిన సమ్మె సోమవారం కొనసాగింది. సమ్మెకు న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు బాలరాజు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహారావు సంఘీభావం తెలిపారు.

కేయూ వద్ద పీడీఎస్‌యూ నిరసన

కేయూ క్యాంపస్: యూనివర్సిటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ రెండో గేట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి మాట్లాడుతూ సమ్మె కారణంగా విద్యార్థులకు తరగతులు కొనసాగడం లేదని వాపోయారు. పీడీఎస్‌యూ హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వంశీకృష్ణ, రంజిత్‌కుమార్, కేయూ కార్యదర్శి పవన్‌కల్యాణ్, బాధ్యులు ముషారఫ్, ఆదిత్య పాల్గొన్నారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాకేష్ వర్మ (SR) : 9885438059 (హన్మకొండ)
వి. రాజ్ కుమార్ (SR) : 9966290903 (హన్మకొండ)
కె. రవీందర్ (SR) : 9705236356 (వరంగల్)
పి.చంద్రశేఖర్ (ACO) : 9963646944 (వరంగల్)